1

# ఏది ఆయుధం?

గడే హోతూరు నుంచి వజ్రకరూరు పోలీసు స్టేషన్‌కు ఓబిలేసును కొడుతూ పోలీసులు తీసుకువచ్చి లాకప్పులో పెట్టారు. ఊళ్ళో సాయంకాలం అరెస్టు చేసి కొట్టారు. కొడుతూ లాక్కొచ్చారు. లాకప్పులో పడేసి కొట్టారు. రాత్రంతా వొళ్ళంతా కుళ్ళ బొడిచారు.

ఊరి నుంచి వెంట వచ్చిన వాళ్ళను తరిమారు. అయినా వాళ్ళు వెళ్ళిపోలేదు. పోలీసు స్టేషన్ రోడ్డు మీద, చెట్టు కింద, టీ బంకు బెంచి మీద ఉన్నారు. ఏం చేయాలో తెలియని వాళ్ళు దుఃఖంతో ఉన్నారు. రాత్రంతా ఉండుండి ఓబిలేసు అరిచే అరుపులు వినలేక, విని ఉండలేక, పోలేక కుమిలిపోతూ అటు ఇటూ తిరుగుతూ దిగులుగా ఉన్నారు.

పోలీసులు కొట్టవలసిన నేరం తానేమీ చేయలేదు. పోలీసులతో తనకే వైరమూ లేదు. పేచీలు లేవు. వాళ్ళెందుకు కొట్టాలి? తానెందుకు పడాలి? ఓబిలేసుకు ఏమీ అర్థం కావటంలేదు. ఇంత బలగముండి తననెవరూ ఆదుకోలేకపోయారు. పోలీసు స్టేషన్‌లో నరసింహులు ఉన్నాడు. గడే హోతూరే! మాదిగ్గేరే! అయిన వాడే! హంతకుడే! హత్యకేసులో అరెస్టు అయినవాడే! ఆ తోవతప్పిన నాడంటే ఓబిలేసుకు పడదు. వాణ్ణి లాకప్పులో పెట్టలేదు. కొట్టటం లేదు. తిట్టటం లేదు. ఇష్టం వచ్చినట్లు పోలీసు స్టేషన్ అంతా కలియదిరుగుతూ ఉన్నాడు. అలసిపోయి కుర్చీలో కూర్చున్నాడు.

ఓబులేసుకు బంధువులు ఉదయమే కాఫీ తెచ్చి ఇస్తామంటే వీలు లేదు అన్నారు పోలీసులు. కానీ కానిస్టేబుల్ వెళ్ళి గ్లాసునిండా పొగలెల్లే కాఫీ తెచ్చి నరసింహులు కిచ్చి అతన్ని ప్రసన్నం చేసుకొన్నారు. ఇడ్లీ వడా తెస్తానని కానిస్టేబుల్ అంటే, వద్దు మసాలాదోసె తెమ్మని చెప్పాడు నరసింహులు.

వజ్రకరూరు మేజర్ పంచాయితీ హాస్పటల్ ఉంది. యమ్మార్వో ఆఫీసు ఉంది. మండలకేంద్రమే కాదు, వజ్రాలగని. కేంద్ర ప్రభుత్వ భూగర్భ వనరుల అన్వేషణ శాఖ మకాం ఒకటి చాలా కాలంగా ఆ గ్రామంలో ఉంది. వర్షాకాలంలో రత్నాలు దొరుకుతాయని పొలాల్లో వెదుకులాడేవాళ్ళు చాలా ప్రాంతాల నుంచి వచ్చి అక్కడ మకాం వేస్తారు. వీళ్ళు చాలామంది ఉరవకొండలో లాడ్జిలో ఉంటారు. ఉరవకొండ, ఉరగకొండ, అతి ప్రాచీన చారిత్రక ప్రదేశం. జైన, శైవ దేవాలయాలు, వైష్ణవం అక్కడ కాలుబెట్టక పూర్వమున్న చరిత్ర సాక్షాలుగా ఉన్నాయి.

పాము పగ ప్రతీకారం తీరిందాకా ఉంటుందంటారు. కానీ ఉరగకొండ వాళ్ళ పగ తరతరాలుగా శేషశేషంగా మిగిలే ఉంటుందట. కర్నాటకు సమీపంలో ఉండటంవల్ల జనం

ఔదప్పల్లాగా కనబడతారు కానీ, నిజానికి వాళ్ళు విజయనగర సామ్రాజ్యంలో పనిచేసిన సైనికుల వారసులు. శత్రుశేషం ఉండనివ్వరు.

నరసింహుల పూర్వీకులు రాయల కొలువులో సైనికులని, వీరులని చెబుతూ ఉంటారు. వాళ్ళ ఇళ్ళలో తరతరాలుగా దాచి ఉంచుకొంటున్న కరవాలాలు, డాళ్ళు అందుకు సాక్ష్యాలు. అవి ఇప్పటికి అనవసరమైన వస్తువులే అయినా, వాళ్ళు వాటిని భక్తి శ్రద్ధలతో కాపాడుకొంటున్నారు.

సైనికుల వంశంలోని నరసింహులు కూడా గొప్ప యోధుడే. వీర లక్షణాలు గుర్తించక జనం అతణ్ణి మంచి జీతగాడు అని మాత్రమే అంటారు. రెడ్డికి అతని శక్తి సామర్థ్యాలు పూర్తిగా తెలుసు. వాటి ఉపయోగం తెలుసు. సమయం సందర్భం వచ్చినప్పుడు వాటి సద్వినియోగం అనుభవించినవాడే! నరసింహుల్ని కూలోడు అనడు. సొంతోడు అంటాడు. అయినోడుగా చూచి, వాడి అవసరాలు తీరుస్తాడు,

ఓబిలేసు రైతు. వానల్లేకపోయినా, సొంతపనుల్లేకపోయినా కూలీ. కమ్యూనిస్టు వాళ్ళ మాటల్లో రైతుకూలీ. ఓబిలేసుకు కొంత భూవసతి ఉంది. నల్లరేగడి. నిఖార్సయింది. పత్తి పండుతుంది. సెనిక్కాయ, పొద్దుతిరుగుడ పూవు, జొన్న, సజ్జ, రాగి, ధనియాలు కూడా పండిస్తాడు. అంతా చేనే అయినా తరికంటే మెరుగ్గా పంట చేతికొస్తుంది. అతనంటే మాదిగ్గేరిలో గురి, నలుగురి తలలో నాలుక. ఎవరికేం కష్టం వచ్చినా నేనున్నానంటూ వస్తాడు.

నరసింహులుదీ మాదిగ్గేరే! రెడ్డింట్లోనే ఉంటాడు. గడే హోతూరులో ఉన్నాడంటే రెడ్డి ఇంట్లోనే ఉంటాడు. లేకపోతే పోలీసు స్టేషన్, కోర్టు, జైలు వీటిలో ఏదో ఉంటాడు. అతనెవరి జోలికీ పోడు. బంధుత్వం ఉన్నా లేనట్లే! ఎవర్నీ పలకరించడు. పలకరిస్తే బదులాడడు. తాగుతాడు. తందనాలాడతాడు. నరసింహులు ఆకారం భీకరంగా ఉంటుంది. రెడ్డి మనిషని, అతనంటే అందరికీ భయం. అతని చరిత్రంటే ఠారు. అతను గేరికి రాడు. వస్తే ఎవరూ మాట్లాడరు. రానివ్వరు. ఓబులేసుని అతను పలకరించినా ఎందుకో పలకరిస్తాడు. ఓబులేసు పలకడు, చూడడు. భయం కాదు, అసహ్యం. బయట పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నవాళ్ళు ఇద్దరికీ బంధువులే! వాళ్ళకు నరసింహులు ఎట్టా చచ్చినా చింతలేదు. ఓబులేసుకు ఏమీ కాకూడదని కోరిక.

పోలీసులతోపాటు ప్రభుత్వం రెడ్డిని గౌరవిస్తుంది. రెడ్డి మనిషని నరసింహుల్ని బాధించదు. ఓబిలేసు నలుగురి మనిషి. వాళ్ళు అతన్ని కొట్టకుండా చూడలేరు. అకారణంగా అరెస్టు చేసినా అడ్డుకోలేరు. దుష్టుణ్ణి శిక్షించలేరు. శిష్టుణ్ణి ఇష్టుణ్ణి రక్షించలేరు.

హెడ్డు టేబిల్ మీద నిద్రపోతున్న నరసింహులు అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. దోమలు కాదు. కాయిల్ ఉంది. ఫేన్ గాలి ఉంది. అరుపులు కేకలు ఏడుపు దెబ్బలు భరించలేక ఓబులేసు ఏడుస్తుంటే నరసింహులు నిద్ర చెడింది. 'ఏమప్పా ఈ పీడ? యాలా పాలా లేదా?

పోటుగాల్లు పొగులేం చేసినారప్పా డ్యూటీ. సాల్లే సాల్లే ఆపండి' అని అరిచాడు. అరుపు అభ్యర్థను ఆర్డరుగా భావించి వాళ్ళు ఉతుకుడు డ్యూటీ ఆపేశారు.

లాకప్పు మూలన పడి ఉన్న ఓబులేసును నరసింహులు తెల్లారినాక చూచి గుర్తు పట్టాడు. ఎందుకూ ఏమీ అని అడగలేదు. 'యాప్పుల్ల' అని అందించాడు. లాకప్పు తాళం తీయించాడు. వెంట తీసుకుపోయాడు. వొళ్ళంతా తడిమాడు. ముఖం కడిగించాడు. ఏమీ అడగలేదు.బాగానే నడుస్తున్నాడు ఓబిలేసు. ఏ ఎముకా విరగలేదు. నెత్తురు రాలేదు. కదుం గట్టలేదు. మూగ దెబ్బలు. పైకి కనిపించకుండా వొళ్ళు హూనం చేయటం పోలీసుల వరం. లాకప్పులోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. కాఫీ టిఫెన్లు తెప్పించాడు. ఇడ్లీ వడా దోసె ఓబిలేసుకు ఇప్పించాడు. తాను తిన్నాడు. కాఫీ తాగాడు. తాగించాడు. మిగిలిన వాటిని పోలీసుల్ని తినమన్నాడు, తాగమన్నాడు. ఎందుకు పోలీసులు అరెస్టు చేశారని నరసింహులు అడగలేదు. నన్ను విడిపించమని ఓబిలేసు అర్థించలేదు. ఆ పరిస్థితిలోనూ స్వాభిమానం.

రెడ్డి కంప్లెయింట్ మేరకు ఓబిలేసును అరెస్టు చేశారు.సూచన మేరకు లాకప్పులో వేశారు. లాకప్పు ఆనవాయితీ ప్రకారం నిజం చెప్పించటానికి కొట్టారు. రెడ్డి డబ్బిచ్చి కొట్టమంటే కొట్టారని పోలీసు స్టేషన్ ముందున్న బంధుజనం భావించి బాధపడ్డారు. తన పొద్దు తిరుగుడు పంట ఓబిలేసు దొంగతనంగా కోసుకుపోయాడని రెడ్డి కంప్లెయింట్.అతను దొంగ కాదని నరసింహులు నమ్మకం. 'నేనమ్మను' అన్నాడు నరసింహులు. 'మేంవూ నమ్మం' అన్నారు పోలీసులు. పోలీసులకు రెడ్డికి ఉన్న బంధం ఈనాటిది కాదు. రెడ్డి పలుకుబడే పనిచేసిందో, డబ్బా దస్కం చమత్కారం చూపించిందో తెలియదు. తెలిసినవాళ్ళు నోరెత్తరు.తెలియనివాళ్ళు చెప్పే సత్యం సత్యం కాదు. పోలీసులు ఊళ్ళోకిపోయి గేరిలో వాకబు చేసి, పొలంలో ఓబిలేసును అరెస్టు చేసి, గ్రామంలోకి తీసుకొచ్చి కేసు చెప్పి, అరెస్టు చేసి, పోలీసు స్టేషన్‌కు లాక్కొచ్చి లాకప్పులో వేసి కుళ్ళబొడిచారు.

పెళ్ళాం పిల్లలు పోలీసుల కాళ్ళావేళ్ళా పడ్డారు. పోలీసులు వినలేదు. గేరిగాళ్ళు అడ్డగించారు. వాళ్ళు నెట్టుకొచ్చారు. ఊరివాళ్ళు ఆటంకపరిచారు. పోలీసులు చెదరగొట్టారు. ఓబిలేసును అరెస్టు చేయటం అంత కష్టమైనందుకు పోలీసులకు చాలా కోపం వచ్చింది. కోపం శక్తి లాఠీలకు తెలుసు. లాఠీలకు భారత, భాగవత, రామాయణాల తాతముత్తాతల దుష్టశిక్షణ తెలుసు. ఇక వినోద కార్యక్రమం మొదలు. ఏం జరుగుతుందో తెలియదు. ఎవరు ఎవరి కోసం ఏమి చేస్తున్నారో అంతుబట్టదు. ఏ యుద్ధం ఎవరు చేస్తున్నారో స్పష్టం కాదు. ఎవరు ఎవరి పక్షాన పోరాడుతున్నారో చెప్పటం కుదరదు. లోపల జరిగిన మారణకాండకు ప్రత్యక్షసాక్షిలా శరీరం, యుద్ధానంతర కురుక్షేత్రంలాగా, దహనకాండ ముగిసిన లంకలాగా, మసీదు కూలిన అయోధ్యలాగా, మానవబాంబు పేలిన పెరంబూదూరులాగా, సజీవంగా ఉంది.

పోలీసుల అంతరంగాలు, లాకప్పుల లోతుపాతులు, జైళ్ళ పునాదుల్లో పూడుకుపోయిన రహస్యాలు, రెడ్డి శక్తియుక్తులు, గ్రామ ప్రజల అశక్త ఆగ్రహాలు, మాదిగ్గేరి నిరపరాధుల పేద అరుపులు, నరసింహులుకి కుండబద్దలు కొట్టినట్లు తెలుసు.

తాను జైలులో ఉన్నప్పుడు సీతక్క లొంగిపోయిందని ఉప్పుకారం తిన్న వొళ్ళు కదా ఓడిపోయిందని, ప్రాయం పసిది కదా, కొడుకు పుట్టాడని తెలుసుకొన్నాడు. రోషం ఉంది, కోపం ఉంది, పౌరుషం ఉంది కదా, మండిపోయి, విడుదల కాగానే, భార్యాబిడ్డల ఆచూకీ లేకుండా చేసి, సాక్ష్యం లేక, కేసు కాక, చావు రాక తప్పించుకొన్న నరసింహులు అనుపానులు రెడ్డికి నిఖార్సుగా తెలుసు.

రెడ్డి దగ్గర జీతగాడుగా ఉంటున్న నరసింహులు, సేద్దెగాళ్ళకు పెద్ద సేద్దెగాడుగా, రెడ్డికి ప్రాణమిత్రుడుగా మారిపోయాడు. రెడ్డి తాగిందే తాగించి, తిన్నదే తినిపించి, నరసింహుల్ని తనంతవాణ్ణి చేశాడు. ఇంటాబయటా నరసింహులు మాటకు తిరుగులేదు. గ్రామానికి నరసింహుల మాటే, రెడ్డి ఆజ్ఞ.

పేదవాడుగా పుట్టినా, రెడ్డి పేదగా పెరగలేదు. పేదల భూములు కొన్ని కొని, కొన్ని ఆక్రమించి, కొన్ని దోచుకొని, పత్తి పండి, పంటలు పండి, భూమాత దీవించి, సంపన్నుడయ్యాడు. కొందర్ని కొట్టి, కొందర్ని కొట్టించి, కొందర్ని చంపి, కొందర్ని చంపించి ఊరిని వశం చేసుకొన్నాడు. ఎదురులేదు. ఎదుట ఎవరూ మాట్లాడరు. లోపల మంట ఉన్న బయటికి పొగరాదు. ఊరి అంతరంగం అశాంతి, బహిరంగం శాంతి. గడేహోతూరును శాంత్యహింసలు పరిపాలిస్తుంటాయి. పోలీసులు వస్తే రెడ్డి దగ్గరకే వస్తారు. ఎమ్మెల్యేకి ఊరన్నా, ఓటన్నా ఇదే.

దౌర్జన్యకాంక్ష విచిత్రమైంది. ఎంత సంపాదించినా తృప్తి ఉండదు. ఆ ఆకలీ దాహమూ తీరవు. తవ్వుతున్న కొద్దీ ఊరే చలమలాగా సంపాదించిన కొద్దీ ఆశ అనలు సాగుతుంది. ఇక నిద్ర ఉండదు. తీరిక ఉండదు. నిరంతరం ధనార్జనే! శ్రమించేశక్తి సన్నగిల్లినపుడు ఆయుధంగా నరసింహులు అందివచ్చాడు. ముదుసలి చేతికర్ర, పోలీసులాఠీ, సైనికుడి తుపాకీ, పాలెగాడి నమ్మినబంటు, బందిపోటుకు తోడుదొంగ నరసింహులు రెడ్డికి.

నరసింహులు తాగటానికి నాలుక పీకి పీడించిన పరమేశ్వరుడైనప్పుడు, ఆడ తోడు కోసం అలమటించే దేవేంద్రుడైనాడు, ఆకలికి పొట్ట అగ్నిగోళంలా మండే పోతురాజుగా మారినరోజు, జన్మహక్కు అయిన గాఢ నిద్రలో కుంభకర్ణుడైనప్పుడు, రెడ్డి సీసాలు, స్త్రీలు, తిళ్ళు, పడకలు ఏర్పాటు చేయించి, స్వర్గమంటే ఏమిటో చూపి, స్వర్గసుఖాలు ఏర్పాటు చేసి వాడి రుచులు పెంచి, వాణ్ణి వశం చేసుకొన్న క్షణాల్లో, రెడ్డి తన పాలిట దేవుడుగా, ఒక్క దేవుడే కాదు, త్రిమూర్తులుగా భావించి, మనసా వాచా, కర్మణా పూజింపసాగాడు నరసింహులు.

భక్తి తలకెక్కాలే కానీ, అది ఆడించని ఆటలుండవు, పాడించని పాటలుండవు, చేయించని భజనలుండవు. ఇయ్యని మానప్రాణాలుండవు. ఆ కైపులో ఉన్న నరసింహులుతో రెడ్డి చేయించని

దొంగతనాలు లేవు, దారి దోపిడీలు లేవు, దారి తప్పించని లారీలు లేవు, దోచుకోని బస్సుల్లేవు, చంపని శత్రువులు లేరు, హతమార్చని వైరి వర్గం లేదు. పోలీసులు వస్తారు. తృప్తిగా పోతారు. కోర్టు బోనుల్లో నిలబెడతారు. సాక్ష్యాలుండవు. శిక్షలుండవు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నరసింహులుకి రెడ్డికి హక్కుభుక్తాలు.

బస్సు దోపిడీ సాక్షి ఒకడు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పటం నరసింహులుకి కోపం తెప్పించింది. సాక్ష్యం చెప్పొద్దన్నాడు. అయినా చెబుతున్నాడు. కోర్టుకు రావద్దన్నాడు. అయినా వస్తున్నాడు. బెదిరింపులు పనిచేయలేదు. డబ్బు ఆశకు లొంగ లేదు. వాడు నీతిమంతుడు. నిజాయితీపరుడు. నిక్కచ్చిగా బతికే ధర్మాత్ముడు. రెడ్డిలాంటి మరో రెడ్డికి నరసింహులు లాంటి నమ్మినబంటు. సమస్య తెగటం లేదు. పేచీ తెమలటం లేదు. తగాదా సాక్షికీ నరసింహులికీ మధ్య లేదు. సమస్య దోపిడీ కాదు. ఆధిపత్యం పోరు. ఆ రెడ్డికి ఈ రెడ్డికీ మధ్య, చిచ్చు రగిలింది. మంట లేచింది. ఆరేటట్లు లేదు.

చంపుతానన్నాడు నరసింహులు. చస్తానన్నాడు సాక్షి. ఈ రెడ్డి రంగం మీదికి వచ్చాడు. ఆ రెడ్డీ గోదాలోకి దూకాడు. సమస్య జటిలమయింది. సాక్షి పూజలందుకొంటున్న దేవుళ్ళాంటి మనిషి. ఎదురుతిరిగి నిలిచినందుకే పూజలు. దేవుడు స్వర్గంలో ఉండాలికాని భూమి మీద కాదు. సాక్షిని స్వర్గానికి పంపక తప్పదు. ఎదిరి వర్గం దెబ్బ తీయకముందే తన తీర్పు అమలు చేయటం అనివార్యం. నరసింహులు నరసింహావతారం ఎత్తాడు. అపరశివుడే అయిపోయాడు. మూడోకన్ను తెరిచాడు. సాక్షి కనబడటం లేదు. కోర్టుకు రావటం లేదు. కేసు కొట్టేశారు. పాత కేసు మాఫీ. కొత్త కేసు ఇంకా ఏదీ రాలేదు. శాంతి.రెండు అశాంతుల మధ్య శాంతి. అవతల రెడ్డి ఏమి ఆలోచిస్తున్నాడో తెలియని శాంతి.

రెడ్డికి నలుగురు భార్యలు. వాళ్ళు వస్తూ చాలా ఆస్తులు తెచ్చారు. పొలం పుట్రా వచ్చింది. బంగారు వెండి ఆభరణాలు దండిగా వచ్చాయి. లెక్క నగదుగా కొదవ లేకుండా వచ్చింది. నలుగురికీ లోపం లేకుండా పిల్లాజెల్లా కలిగారు. చదువుసంధ్యలొచ్చాయి. పెళ్ళిళ్ళు పేరంటాలు కొదవలేదు. ఉద్యోగ సద్యోగాలు చింత లేదు. పిల్లలంతా మెట్టినిళ్ళకో, ఉద్యోగాలకో వెళ్ళిపోయారు. ఇంట్లో సంతానం లేదు. నలుగురు భార్యల ఆరోగ్యం బాగుంది. ఇంటినిండా సంపద ఉంది. అంతా బాగానే ఉంది. రెడ్డి ఆకలే తీరటం లేదు. దప్పిక అవుతూనే ఉంది. ఎంత తాగినా, దాహమే దాహం! నరసింహులు లాంటి ఆయుధాలు చేతినిండా ఉన్నాయి. పెద్ద రెడ్డి అనే పేరు ప్రఖ్యాతులున్నాయి. తనవాడే ఎంఎల్ఏగా గెలుస్తాడు. తన పనులు చేసి పెడతాడు. ఆ రెడ్డికి ప్రాణం నరసింహులు. అతను కదులుతుంటే రెడ్డి గుండె ఆడుతుంది. అతను సుభిక్షంగా ఉంటే ఇతను సురక్షితంగా ఉంటాడు. అందువల్ల అతనెంత చెబితే అంతే. ఏది చేస్తే అదే చెల్లుబాటు. అతని మాటకు చేతకు తిరుగులేదు. తరుగు లేదు. అతను కిరీటం లేని మహారాజు. అన్నదమ్ములేని ధర్మరాజు.

ఫలానా వాడు మనకు శత్రువు. వాడికీ మనకీ పగ. ఆ వైరం తెగిపోవాలని, నువ్వే తెంచాలంటే నరసింహులు అసహాయశూరుడు. ఒంటిచేత్తో చేతికి నెత్తురంటకుండా, కాగల కార్యాలు గంధర్వుడై చేసి వచ్చి స్వర్గసుఖాలు అనుభవించేవాడు.

చాలా కేసులు బయటపడేవి కావు. కొన్ని పోలీసు స్టేషనుకు వచ్చేవి. ఆ కేసులకు సహజ మరణమో, పరిష్కార ఫలితమో లభించేది. కోర్టుకు పోయేవి కొన్ని, సాక్ష్యం లేక చాలా వాటిని న్యాయమూర్తులు కొట్టేసేవాళ్ళు. ఒకటీ అరా దొంగతనాలకు మాత్రమే శిక్షలు పడేవి. అవీ పెద్ద శిక్షలు కావు.

జైలులో కూడా నరసింహులు స్వర్గ సుఖాలకు కొదవ లేదు. అతనిది మహారాజ యోగం, నిర్విఘ్నంగా జరిగేది. కడుపునిండా తాగి, తినేవాడు. కంటినిండా నిద్రపోయేవాడు. రంభా, ఊర్వశీ, మేనక, తిలోత్తమలు వచ్చి సపర్యలు చేసేవాళ్ళు. చెప్పినట్లు వినేవాళ్ళు. ఇంటికంటే గుడి పదిలం అంటారు. నిజానికి గుడికంటే జైలు పదిలం. ఎందుకంటే ఇంట్లో ఉండే సుఖాలన్నీ, సంపన్నులకు, పలుకుబడి ఉన్నవాళ్ళకు, వాళ్ళ ప్రతినిధులకు యధేచ్ఛగా అక్కడ ఉంటాయి. పైపెచ్చు శత్రువు రాలేడు. చంపలేడు. భయం లేదు.

ఎవరో గుర్తు తెలియనివాళ్ళు, ఆచూకీ లేనివాళ్ళు, అజాపజాలేని వాళ్ళు, అయిపులేనివాళ్ళు, అన్ని అన్యాయాలకు రెడ్డి మూలం కాబట్టి, రెడ్డిని లేపేస్తేగాని పల్లెలకు ప్రశాంతి లేదని, పొరుగూరు రెడ్డికి దుడ్డిచ్చి, కిరాయి హంతక ముఠాతో హత్య చేయించాలని ఒప్పందం కుదుర్చుకొన్నారు. అదీ నరసింహులు జైలులో ఉన్నప్పుడు జరగాలి. గడేహోతూరు నుంచి ఉరవకొండ పోయే బస్సులోంచి, వజ్రకరూరు దాటగానే, లాగి చంపాలని పథకం.

రెడ్డికి రెండు కార్లున్నాయి. లారీ ఉంది. ట్రాక్టరు ఉంది. వాటి మీద ప్రయాణం చేయడు. బస్సులోనే భద్రం. ఈలోగా నరసింహులు పెరోల్ మీద బయటకి వచ్చాడు. ఇద్దరూ బస్సులో వస్తున్న రోజు మాత్రమే ఆ ముఠాకు అనుకూలమయింది. నరసింహులు వీపు మీద వేటకొడవలి లేదని వాళ్ళు సంబరపడ్డారు. బొడ్లో పిస్తోలుందని గుర్తించలేదు. వాళ్ళ దగ్గర వేట కొడవళ్ళతోపాటు, గొడ్డళ్ళున్నాయి. వజ్రకరూరులో వాళ్ళు బస్సెక్కారు. బస్సు బయలుదేరి ఊరు దాటింది. వాళ్ళు ఏ క్షణానయినా కార్యక్రమం ప్రారంభించవచ్చు. వాళ్ళను గమనిస్తూనే ఉన్నారు నరసింహులు, రెడ్డి. వాళ్ళు ముందుకు రాకపోతే, తాము కల్పించుకోకూడదని వీళ్ళునిర్ణయించుకొని సిద్ధంగా ఉన్నారు.

మందుగుండు సామాగ్రి ఉన్న ఆంగ్లేయుడికి భారతీయ రాజులు దాసోహం అన్నట్లు, ఇనుప ములికి ఉన్న ఆర్యులకు, ఇనుం ఉపయోగం తెలియని భారత ప్రభువులు గణాధిపతులు, చిల్లరమల్లర తెగల గణపతులు చెల్లాచెదురయ్యారు. శిలీముఖ బాణాలకు, చెక్క బాణాలు, ఇనుప చక్రాలున్న వాహనాలకు, చెక్క చక్రాలున్న రథాలు, వేగంగా కదిలే అరబ్బీ గుర్రాలకు, ఏనుగుల మందలు ఓడిపోయినట్లు, వేట కొడవళ్ళకు, గొడ్డళ్ళకు, బరిసెలకు పిస్తోలు ఓడిపోదని

కిరాయి ముఠా హంతకులు గుర్తించలేకపోవటం అన్యాయం ఏమీకాదు. ఒకడు చనిపోయి బస్సులోనే పడిపోయాడు. మిగతావాళ్ళు బస్సు దిగి పారిపోయారు. పారిపోయేవాళ్ళు వెంటబడి కాల్చి చంపి వెన్నుపోటుదారుడుగా మిగిలే అపప్రధను అంటగట్టుకొనే అవినీతిపరుడు కాదు నరసింహులు. బస్సు సాక్ష్యం.

ప్రాణ రక్షణ కోసమే కాల్చవలసి వచ్చిందని కోర్టులో నిలబడగలడు నరసింహులు. చుట్టు పక్కల గ్రామాల్లో, ఇద్దరు చోటా నాయకులు, కిరాయి హంతక ముఠా మిగతా సభ్యులు అదృశ్యం కావటం తెలిసినా, కారణం ఎవరికీ తెలియదు. అయినా రెడ్డి ప్రాణం కోసం కాచుకూర్చున్నారు హంతకులని పుకారు గాలిలో పచార్లు చేస్తూ ఉంది. రెడ్డికి ప్రాణ భయం పూర్తిగా తొలగిపోలేదు.

రెడ్డి అండర్‌గ్రౌండ్‌కు వెళ్ళిపోయాడు. ఆత్మరక్షణ ఆయుధంతో నరసింహులు పోలీసులకు లొంగిపోయాడు. శత్రు ప్రయత్నాల అంతుపొంతులు తెలిసిందాకా అతను పోలీసుల ఆతిథ్యం, అత్తవారింట కొత్త అల్లుడులాగా స్వీకరిస్తూ ఉంటాడు.

బాటిలు పంపితే చాలదు, సోడాలు సంజుళ్ళు పంపాలి, భోజనం కేరియర్ పంపితే చాలదు. వడ్డించే గాజుల చేతుల్ని పంపాలి. డబ్బు పంపితే కాదు. ఖర్చు చేసుకునే అవకాశం కల్పించాలి. పోలీసులు చెప్పినట్లు వింటేకాదు, చేయమన్న పని చేయాలి. అన్నీ అమర్చిపెట్టటానికి రెడ్డి ఏ క్షణానో, ఎటునుంచో వచ్చి ఏమో ఏర్పాట్లు చేసి, ఎట్లాగో వెళ్ళిపోతానని కబురు చేశాడు.

పోలీసు కానిస్టేబుల్ కేరియర్ తేవటానికి పోతూ 'యేం కావల్ల' అన్నాడు.

'బిరియాని రొండు' అన్నాడు.

'రొండేల?'

'నాకూ ఓబులుగానికి' అని జవాబు చెప్పాడు.

'రెడ్డిగ్గాని కోపం రాదా'?

'కోపంవా? యాల? యెవురికీ? రెడ్డికా? రాదు, రాదు! నేనుండగా! బయింలేదు! నువ్ బో కేరీరు కొ్ందబో! బిరీగ్గా యలబారి రా'

కానిస్టేబుల్ వెళ్ళిపోతుంటే నరసింహులు కేకేసి పురమాయించాడు.

'మీరూ రొండు కేరీర్ల నిండా, మూడో, నాలుగో బిరియాని తెచ్చుకొంిడ్రి!'

* * *

నారాయుడు కళ్ళ పడకూడదేకాని, పద్దాయో,కన్నెపిల్లయినా, పంట పొలమయినా, తన సొంతం కావలసిందే! పొలం అయితే తిరిగి ఇవ్వడు కాని, కన్నెపిల్లనయితే పెళ్ళి చేసుకోవటానికి అనుమతి అనుగ్రహిస్తాడు. అందమైన ఆడపిల్లలు ఆ ఊరికి కొత్త పెళ్ళి

కూతుళ్ళుగా రావటానికి హడలి చస్తారని వదంతి. గడేహోతూరులో కన్నెపిల్లలు కరువయ్యారు. ఆడపిల్లలు పుట్టలేదని కాదు. ఈడేరే ప్రాయానికి ఆ వూరు విడిచిపోయేవారు. అందువల్ల ఊరివాళ్ళ మీద ఎనలేని కోపం. ఆ కోపం పొలాలు ఆక్రమించుకోవటంతో తీరిపోసాగింది. ఈమధ్య వయస్సు మీద పడో, మంచి బుద్ధి వచ్చో, ఆ మధ్య వచ్చిన జబ్బు వల్ల మర్మావయవం తీసివేయటంవల్లో, ఆడపిల్లల విషయం పట్టించుకోవటం లేదు కాని, భూదేవిని మాత్రం దురాక్రమణ చేస్తూనే ఉన్నాడు నారాయుడు.

నారాయుడు దృష్టి పడ్డ పొలాలు ఇచ్చేసి, తాను ఏమన్నా ఇస్తే తీసేసుకొని, రైతులు తమ పొలంలో తాము కూలీలుగా, అదృష్టం కలిసివస్తే జీతగాళ్ళుగా బతకాలి. లేదంటే ఊరొదలాలి. కొందరు ఊరిడిచారు. గడేహోతూరులో ఇప్పుడు రైతులు తక్కువ. సేద్దెగాళ్ళు కూలీలు ఎక్కువ.

ఓబిలేసు చేను పత్తి విస్తారంగా పండేది. నీటి వసతి ఉంది. ఓబిలేసు కూతురు ఈడేరే ప్రాయండి. కాపరం పచ్చగా ఉంది. అందరూ పొలం పని చేసుకొని గుంభనంగా బతుకుతున్నారు. నారాయుడు చూపు పడిందీ పొలం మీద. అతని నాగళ్ళు వచ్చి ఒకరోజు పొలం దున్నసాగాయి. సహజంగానే ఓబిలేసు అడ్డం పోయాడు. మామూలుగానే సేద్దెగాళ్ళు అతన్ని కొట్టారు. కొడితే గాయాలు కావటం రూలే! రూలు ప్రకారం ఆసుపత్రిలో చేరాడు. పగలు చేరినవాడు రాత్రయినా ఊరుకు రాలేదు. కుట్లు పడ్డాయి. కట్లు గట్టారు. వారానికి కట్లు విప్పారు. గాయాలు మానాయి. కాని గుండెలో గాయం పచ్చిగా, పుండుగా, మంటగా, తీటగా, తీపరంగా ఉంది.

ఓబులేసు ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఖర్చులకని నారాయుడు అతని భార్యకు లెక్క ఇచ్చి మొగునికిమ్మని చెప్పాడు. చేతిలో సొమ్ము అతని చేతిలో పెట్టి, కన్నీటి కబురు అందించింది. కారే కన్నీరు కానుకగా నా రాయుడు కళ్ళకిచ్చింది.

నారాయుడు మండిపడి, ఆడకూతురని మన్నించి ఓబిలేసుతో రాజీ చేసుకొని, అతని పొలం తాను కొన్నందుకు సొమ్మిచ్చి పత్రాలు రాయించుకో చూశాడు. ఓబిలేసు ఆసుపత్రి నుంచి వెలుపలికి రాగానే బంధువులు చుట్టుకొని ఏడ్చారు. భూమి, మానం పోగొట్టుకొన్న అందరూ కలిసి పోలీసు కంప్లెయింటు ఇవ్వబోయారు. ఓబిలేసు తన గోడు గొల్లుగొల్లున వినిపిస్తూ మొరపెట్టుకున్నాడు. హెడ్డు కాగితం తీసుకోలేదు. కలం తీసుకోలేదు. కంప్లయింట్ బుక్కు ముట్టలేదు. ఎఫ్ఫయ్యారు రాయలేదు. యస్సై పని పురమాయించలేదు.ఎంత చెబుతున్నా వింటున్నారు ఏమీ బదులాడటంలేదు. హెడ్డు హితబోధ చేశాడు. మర్యాదిచ్చాడు. హద్దు దాటొద్దన్నాడు. నారాయుడితో రాజీ పడమన్నాడు.

ఓబిలేసు సవివరంగా, సవిస్తరంగా తన హక్కు భుక్తాల గురించి చెప్పాడు. తమ తాతముత్తాత కాలం నుంచి, ఆ భూమి తమ సొంతమన్నాడు. శిస్తు రసీదులున్నాయన్నాడు. ఇంగ్లీషు దొరలు భూమికి సర్వేనంబర్లు ఇవ్వకపూర్వం నుంచి ఆ భూమంతా తమదేనన్నాడు.

దొరలు కూడా తమ భూమి పట్టా తమకు ఇచ్చారన్నాడు. ఆ భూమి తమ పూర్వీకులకు శ్రీకృష్ణదేవరాయలు వీరమాన్యంగా ఇచ్చాడని చెప్పాడు. అందుకు తామ్ర శాసనం ఉందన్నాడు. వీరశౌర్యం చావదన్నాడు.చావో బతుకో తేల్చుకొంటానన్నాడు. నారాయుడో తానో ఒక్కరమే బతికి ఉంటామన్నాడు. దాయాదులు తరతరాలుగా పంచుకోగా ఈ తరంలో తన వంతు ఆ మాత్రం భూమి వచ్చిందని, తనకు మరింక జీవనాధారం లేదని, దోషిని శిక్షించమని, తన పొలం తనకిప్పించమని, తాను ఆసుపత్రిలో ఉండగా, నారాయుడు తన పొలంలో పంట పెట్టాడని, దాన్ని దున్నేసానని ఓబిలేసు గోల పెట్టాడు.

కాశీ చూసొచ్చిన సన్యాసి, కాటికి కాళ్ళు చాచిన ముసలివాడికి చెప్పినట్లు, హెడ్డు ఓబిలేసుకు చెప్పాడు.'కొరివితో తలగోక్కోవద్దని' ఓబిలేసు వినలేదు. నిజానికి అది ఆస్తి రూపం కావటంతోపాటు గౌరవ చిహ్నంగా, రాచరికపు మర్యాద కావటంవల్ల , ఆ గొప్ప తన కాలంలో నేలపాలు అయిపోవటం భరించలేకుండా ఉన్నాడు. తరతరాలుగా కాపాడి సాగుచేసి, పండించి, దాని దయాధర్మం మీద జీవించినవాళ్ళ వంశంలో తాను చెడబుట్టిన వాడుగా మిగలటం తట్టుకోలేకుండా ఉన్నాడు. భవిష్యత్తరాల తన వారసులు తనను అసమర్థుడని, పిరికిపందని, సైనిక వంశంలో సన్నాసి పుట్టాడని నిందించే స్థితి ఊహించుకోలేకుండా ఉన్నాడు.

హెడ్డు కంప్లయింట్ తీసుకోకపోవటం, తనను మభ్యపెట్ట చూడటం గ్రహించి 'ఇదిగాదు పని' అని యస్సై ఏమో చెప్పుకోబోతే 'సూత్తాంబో' అనటంతో మండిపోయింది. వీళ్ళు వాడి మోచేతి నీళ్ళు తాగారని, వాడి మూతి నాకారని నమ్మి 'న్యాయం జరిగేదాంకా పోయేది లేదని' పోలీసుస్టేషన్ వాకిలిముందు బాచిపట్టు వేసుక్కూర్చుని సత్యాగ్రహం మొదలు పెట్టాడు.

ఒకరాత్రీ, ఒక పగలూ, ఓబిలేసు అక్కణ్ణుంచి లేవలేదు. బలవంతంగా పోలీసులు లేపలేదు. సాయంకాలానికి జీపులో డీయస్‌పి వచ్చాడు. ఎట్టున్నాడు మనిషి? పులిలాగున్నాడు! మూతి మీద మీసం ఎట్టుంది? మోచేతి లావుంది! ఏ రంగు? కారు నలుపు! మనిషేం రంగు! రాకాసి బొగ్గు రంగు! మీసం మీద ఏమి నిలబెట్టవచ్చు? నిమ్మకాయనేంది, దానెమ్మకాయనే నిలబెట్టవచ్చు. బూటులు టకటకలాడించాడు.లాఠీ చెడమడా ఊపాడు. ఖాకీ బట్టలు పెళపెళలాడాయి. తళతళలాడాయి. పులి చూచినట్లు చుట్టూ చూశాడు. పులికంట్లో ఓబిలేసు పడ్డాడు. పులి లోపలికి పోయింది.

లోపల్నుంచి ఆర్డరు రానేవచ్చింది. ఆర్డరుతోపాటు కానిస్టేబుల్ రానేవచ్చాడు. ఓబిలేసుని గట్టిగా పట్టుకున్నాడు. దొంగోణ్ణి వాటేసుకొన్నట్లు కరుసుకొన్నాడు. అన్నను ఆలింగనం చేసుకొన్నట్లు చుట్టుకొన్నాడు. ప్రియుణ్ణి ప్రేయసి కౌగిలించుకొన్నట్లు అల్లుకుపోయాడు. అతి గౌరవమర్యాదలతో 'దొరగారమ్మన్రా!' అంటూ లోనికి తీసుకుపోయాడు.

'కాకిగోల! పాడు సంత! లేనిపోని పెంట!' హెడ్డు గొణుగుతున్నట్లే ఉన్నాడు. కానిస్టేబుళ్ళు కళ్ళనీళ్ళు దయతోనో, భయంతోనో బయటపడలేక భంగపడుతున్నాయి.

ఓబిలేసు తీరుబడిగా తన ఏడుపు కన్నీళ్ళుగా మూటకట్టి డీయస్పి కాళ్ళ మీద కుమ్మరించాడు. 'నీట ముంచినా, పాల ముంచినా దొరవారిదే భారం' అన్నాడు.

డియస్పి కి కన్నీళ్ళు కదిలినట్లు కళ్ళు మెరిశాయి. అతను ఇటువంటి ఆగడాలు అనేకం చూశాడు. ఎన్ని బాధలో సినీమారీళ్ళులాగా కళ్ళముందు చిత్రవిచిత్ర జగత్తుల్ని, పంచరంగుల్లో చిత్రించి చూపిస్తుంటే కడుపునిండా దుఃఖించి కళ్ళనిండా ఏడ్చి, చేయత్తలేక, నోరెత్తలేక నిశ్శబ్దంగా కుక్కిన పేనులాగా ముడుసుకుపోయిన రోజులు గుర్తు లేకపోలేదు. పులి ముఖం చూస్తుంటే ఓబిలేసుకు ఆశలు మోసులెత్తాయి.

'ఏడ్చే మొగోన్ని, నవ్వే ఆడపాపని' నమ్మరాదని హెడ్డు సిద్ధాంతం. ఓబిలేసుని నమ్మరాదనుకొన్నాడు. దొరవారి కళ్ళలో నీటి ఆచూకీ భయం కలిగించింది. అసమర్థులు అసహాయ స్థితిలో ఏడవలేక ఏమీ చేయలేరనేది హెడ్డుకి తెలియదంటే ఎవరూ నమ్మరు.

డియస్పి దొరవారి కళ్ళలో నీటి చెమ్మ మెరుపుకు అతని బాల్యం నాటి అనుభవం పరంపర దాగి ఉంది. మోతుబరుల పెత్తనంలో కుంగిపోయిన తన కుటుంబం, సంపన్నుల ఆరాచకాలకు ఆవురావురుమంటూ అణగారిపోయిన జనం, బలవంతుల బంద పనులకు బలయిపోయిన తన బంధుమిత్రుల బాధలు తనకింకా గుర్తే! దళితులే ఎందుకింతగా హింసకు గురి అవుతున్నారా అని కుమిలి పోసాగాడు. ఆ స్థితికి డియస్పి దళితుడు కావటమే కారణమని ఓబిలేసుకు తెలుసు. హెడ్డుకు తెలుసు, యస్సయికి తెలుసు. కోడై కూస్తున్న లోకానికి తెలుసు.

యస్సయికి, హెడ్డుకి ఏం చేయాలో డియస్పి చెప్పాడు.

ఓబిలేసు భుజం మీద చేయివేసి, నీ చేను నువ్వు దున్నుకో అని అభయమిచ్చాడు.

నారాయుణ్ణి గురించి యస్సయి, హెడ్డు, దొరవారికి చాలా సంగతులు చెప్పారు. సమాచారం అందించారు. వివరాలు వెల్లడించారు. తలుచుకొంటే ఏం చేయగలడో చెప్పారు. తలుచుకోకపోతే ఎందుకు తలుచుకోడో వివరించారు. ఉలక్కుండా, పలక్కుండా అన్నీ విన్న దొరవారు చివరాఖరికి 'ఏం చేద్దాం?' అన్నాడు.

ఏమీ చెయ్యలేమన్నారు. ఏం చేసినా ఉద్యోగాల్లో ఉండలేమన్నారు. శ్రుతి మించితే బతకలేమన్నారు.

డియస్పి దొరవారు ఏమీ సెలవివ్వకుండా జీపు ఎక్కి వెళ్ళిపోయాడు.

తన చేనిలో నారాయుడు పెట్టిన పొద్దుతిరుగుడు విత్తనాలను ఓబిలేసు దున్నేశాడు. తానూ మళ్ళీ అదే పంట పెట్టాడు. చేనిలోని నారాయుడి విత్తనాలే అంటే ఓబిలేసు విత్తనాలే అని సమస్య మొదలైంది. చేను దున్నేస్తున్నా ఎవరూ అడ్డగించలేదు. విత్తనాలు వేసినా ఎవరూ వద్దనలేదు. నారాయుడూ రాలేదు. సేద్దెగాళ్ళూ కనపడలేదు. ఓబిలేసుకు భయం భయంగా ఉంది. మాదిగ్గేరి మాత్రం పండగ చేసుకొంది.

ఎప్పుడేమౌతుందోనని అందరికీ ఆతురతగా ఉంది. నారాయుడో, అతని సేద్దెగాళ్ళో దొంగ దెబ్బ తీస్తారని మాదిగవాళ్ళు గగ్గోలుగా చెప్పుకొంటున్నారు. మాదిగలకు కష్టం కలిగిస్తే డియస్పి తాట తీస్తాడని నారాయుడికీ, అతని బలగానికీ బెదురుగా ఉంది.

గడేహోతూరు జనం భయం గుప్పిట్లో వణుకుతున్నారు. స్వేచ్ఛగా ఉండలేరు వీళ్ళు. భయం లేకపోతే బతకలేరు. నిర్భయంగా నలుగురం కలిసి సహజీవనం చేద్దామన్న ఆశ, కోరిక పునాదుల్లోనే కుళ్ళి మొలకెత్తకుండా చచ్చిపోతున్నాయి. భయంలేని బతుకు వాళ్ళకిష్టమున్నట్లుగాలేదు. ఒకడికొకడు మిత్రుడిలాగా కాక, శత్రువు లాగా భయపడుతూ, భయపెడుతూ జీవిస్తున్నారు. వాళ్ళకు ఎదుటివాడు శత్రువుగా ఉండటం ఇష్టం లాగుంది. ఇరుగుపొరుగు సోదరుల్లాగా కాక, పగవాళ్ళులాగా ఉంటే ఊపిరి ఆడేటట్లుంది. వైరి వర్గం, ప్రాణభయం ఉంటే జనం సంతోషించేట్టుగా ఉన్నారు. అవతలివాడు అణిగిమణిగి ఉంటే హతమారుస్తారని, అందరూ చెలరేగి ఉండటం కోరుకొంటున్నట్లున్నారు జనం. భయం నీడలో బ్రతకటం వాళ్ళకభీష్టంగా ఉంది. తిరగబడేవాళ్ళుంటే ప్రజలకు ప్రశాంతంగా ఉంటుంది. నోరెత్తని వాళ్ళుంటే ఊరు స్మశానంగా మారుతుంది. చచ్చేవాడు, చంపేవాడు అంతరించిపోయే వాళ్ళేనన్న నిజం అర్థం కాకపోవటం దురదృష్టం. అన్నదమ్ముల్లా సహజీవనంలో కలిసిమెలసి ఉండలేకపోవటం ఘోరం. అవసరాలకి మించి ఆర్జించటం, అవసరాలు తీరక అవస్థలు పడటం మధ్య అసలు పీడ ఉంది. తాము పెత్తనం చేయటం కోసమే పుట్టామని, మిగతావాళ్ళు సేవ చేయాలని భావించటం వల్ల సమస్య ప్రాణం పోసుకొంటుంది. దోపిడీ చట్టబద్ధం, శాస్త్ర సమ్మతం, సాహిత్య సంప్రదాయం కావించేవాళ్ళతోనే కష్టం. ఈ కష్టం తీరే మార్గం ఏది? ఎక్కడుంది? ఎక్కడో ఉంది! ఉంటుంది! అది వెలుగు చూసేదాకా ఈ జనాన్ని కాపాడు.

తనను భయపెట్టిన ఓబిలేసును, డియస్పిని తాను విత్తనం వేసిన చేనును దున్ని మళ్ళీ విత్తనం వేయటాన్ని చూచి ఊరికే ఉండటానికి నారాయుడు మగతనంలేని ఆడంగిలోడా? కాదు! పంటికింది రాయిని ఉమ్మేస్తే పోతుంది. కొరకరాని కొయ్యను కాలిస్తే బూడిద అవుతుంది.

ఓబిలేసు పెట్టిన పొద్దుతిరుగుడు పూవు చేతికి వచ్చే నాటికి డియస్పికి బదిలీ అయింది. ఎంత వేగంగా ఆర్డర్లు వచ్చాయో అంత వేగంగా రిలీవ్ చేశారు. డియస్పి దొరవారు వెళ్ళిపోయారు. అదృష్టవంతుడు ప్రాణాలతో బైటపడ్డాడు.

హెడ్డు మిక్చర్ తెచ్చాడు. కానిస్టేబుళ్ళు బాటిళ్ళు తెచ్చి టేబిల్ వేశారు. యస్సయి మోటార్ సైకిల్ మేఘాల మీద తేలి వచ్చింది. పోలీసు స్టేషన్ బార్ రూం అయింది. ఖాకీ డ్రస్సుల కస్టమర్లు కూర్చున్నారు. బాటిల్ మీద బాటిల్ దెయ్యాలను వెలుపలికి తోలాయి.

పోలీసు స్టేషన్ మత్తులో తూగుతూ ఊగుతూ ఉన్నప్పుడు గడేహోతూరుల్లో ఓబిలేసు చేనిలోకి నారాయుడితో పాటు అతని మనుషులు వచ్చి సన్‌ఫ్లవరు నున్నగా కోశారు. బళ్ళకెత్తారు. ఊళ్ళోకి తోలారు. ఇంట్లో వేశారు.

అప్పుడు మాదిగలకీ విషయం తెలిసింది. బిక్కచచ్చి పోయారు. పరుగెత్తుకెళ్లి ఏడుస్తున్న ఓబిలేసును ఓదార్చారు. చేనిలో సన్‌ఫ్లవర్ మొక్కలు కిరీటాలు లేని మహారాజుల్లా తలకాయల్లేని సైనికుల్లా వాలిపోయి ఉన్నాయి. చేతికి వచ్చిన పంటపోయి, గౌరవ మర్యాదలు పోయి, వంశ పారంపర్యంగా హక్కుపోయి, ఓబిలేసు కుమిలిపోయాడు.

అంత దుఃఖంలో ఓబిలేసుండగా, పోలీసులు వచ్చి, నారాయుడి సన్‌ఫ్లవరు పంట దొంగతనంగా కోసుకుపోయినందుకు అరెస్టు చేసి, ఏమి చెప్పినా వినకుండా, ఎవరూ అడ్డం వచ్చినా ఆగకుండా, ఎవరేం అడిగినా చెప్పకుండా, జీపులో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి చితకబాదారు. ఆ రాత్రంతా ఓబిలేసు శరీరంతో ఆడుకొన్నారు. పోటీ ఆట అయిపోయింది. ఫుట్‌బాల్, వాలీబాల్, బేస్కట్‌బాల్ వంటి పాత ఆటలతో పాటు, క్రికెట్టు, టెన్నిస్ కూడా ఆడేశారు. నరసింహులు విసుక్కోకపోతే డే అండ్ నైట్ మేచ్ రసపట్టుగా సాగి ఉండేది. శవం కొండకోనల్లో ఎన్‌కవుంటర్ అయిపడి ఉండేది. పేపర్లు లాకప్పు చావు అని పతాక శీర్షికలతో ప్రచురించి ఉండేవి. ప్రజలు చదివి ఎంతో దుఃఖించేవాళ్ళు. గడేహోతూరు వాళ్ళూ వజ్రకరూరు వాళ్ళూ కలసి సమ్మె చేసేవాళ్ళు. ఊరేగింపుగా యమ్మార్వో ఆఫీసుకు పోయి న్యాయం చేయాలని, పోలీసుల్ని శిక్షించాలని, ఉద్యోగాల నుంచి తొలగించాలని, నిరాహార దీక్షో, సాహారదీక్షో చేపట్టి టెంటు వేసేవాళ్ళు. కలెక్టరు వచ్చేవాడు. విచారణ జరిపిస్తానని ప్రకటించేవాడు. నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించేట్టు చేసేవాడు. భార్యకో, కూతురికో, స్వీపరో స్కెవేంజరో ఉద్యోగం ఇచ్చేవాడు. నరసింహులు నిద్రపట్టక అరచిన అరుపుతో అంతా పాడయిపోయింది. ఓబిలేసు బ్రతికిపోయాడు.

* * *

పోలీసులు కేరియర్ తెచ్చారు. బిరియాని పాకెట్లు, కోడివేపుడు, చేప పులుసు, పొట్లికూర తెచ్చారు. రాత్రి పడక అయిన టేబిల్, డైనింగు టేబిల్‌గా మారిపోయింది. పోలీసులు ఒక కుర్చీ వేస్తే, నరసింహులు రెండోది వేయించాడు. ఓబిలేసును లాకప్పులో నుంచి వెలుపలికి రప్పించి, టేబిల్ ముందు కుర్చీలో కూర్చోమన్నాడు. సందేహిస్తూ, తటపటాయించి, తల ఆడించి, నరసింహులు ముఖంలోకి తదేకంగా చూచి, నరసింహులు కూర్చున్నాడు. రెండో కుర్చీలో నరసింహులు కూర్చుని, కేరియర్ తీశాడు. ఓబిలేసుకు వడ్డించి, తాను వడ్డించుకొని తినసాగాడు. దిక్కులు చూస్తున్న వాణ్ణి తినమన్నాడు. అతనికి ఏమీ అర్థం కావటంలేదు. ఇదంతా ఎందుకు జరుగుతుందో తెలియటం లేదు. 'తినుమల్లా!' అని నరసింహులు తింటూన్నాడు. "ఊ" అన్నాడే కాని తినకుండా ఎటో చూస్తున్నాడు. తన పొలం తన పంట, నారాయుడు కోసుకు పోవటమేమిటి, దొంగతనం తనకు అంటగట్టమేమిటి? విచారించకుండా అరెస్టు చేయటమేమిటి? చావుదెబ్బలు కొట్టటమేమిటి? ఏ ప్రశ్నకూ జవాబు దొరకటం లేదు. నరసింహులు కేరియర్ తెప్పించటమేమిటి? ఏమీ అంతుబట్టటం లేదు. అంతదాకా లాకప్పులు చావుదెబ్బలు కొట్టిన పోలీసులు సేవకుల్లా వడ్డనచేయటమేమిటి? లాకప్పు నేల మీద పొర్లిన, దొర్లిన తాను కుర్చీ మీద, టేబిల్‌కాడ కూర్చోటమేమిటి? ఏ శక్తులు ఎలా నడిపిస్తుంటే తానిలా నడుస్తున్నాడు?

దొంగ, హంతకుడు, తాను మాట్లాడించటానికి కూడా అసహ్యించుకొనే మనిషి, తనకు తోడు పడటమేమిటి? ఓబిలేసు వందల ప్రశ్నల్లో, సమాధానం లేని వాటిల్లో, కూరుకుపోతున్నాడు. తేలతాడో లేదో!

పోలీసుల వైపు చూశాడు. వాళ్ళు కోపంగా లేరు. వాళ్ళతో ఏమీ వైరం లేని తనను అంతగా చావబాదాలా? తానేమన్నా ఎనుంగొడ్డా? ఓబిలేసుకు ఏడుపు వస్తూ ఉంది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తినటం ముగించిన నరసింహులు చేయి కడుక్కొని టేబిల్ దగ్గరకు వచ్చాడు.

ఏడుస్తున్న వాణ్ణి చూశాడు. కళ్ళు తుడిచాడు. బిరియాని ముక్క నోట్లో పెట్టాడు. 'కొరుకు!' అన్నాడు. 'పీకు' అన్నాడు. 'నములు' అన్నాడు. 'నా కొడుకుని నమిలి మింగేయ్' అన్నాడు.

తినటం ఆపి నరసింహులు ముఖంలోకి ప్రేమగా చూశాడు. ఏమిటన్నట్లు కళ్ళు మెరిశాయి. 'యెమకన్ని' అన్నాడు. అని శారువాలో అన్నం కలిపి ముద్ద పెట్టబోయాడు.

ఓబిలేసు వారించి తానే తీసుకొని నెమ్మదిగా తినసాగాడు. పొరబోయింది. పోలీసు కానిస్టేబుల్ నీళ్ళ గ్లాసు అందించాడు.

గెలిస్తే హీరో! ఛస్తే విలన్! ఓడిపోతే రాజు శవం. గెలిస్తే రాజుకి సింహాసనం పట్టాభిషేకం. గెలుపు ఓటముల మధ్య సన్న వెంట్రుక. అది తెగితే, అటో ఇటో!

ఓబిలేసు తింటున్న మెతుకులతో పాటు దుఃఖం కూడా దిగమింగాడు. అరగని దుఃఖంలెక్క లేనన్ని ప్రశ్నలుగా వాంతి అవుతూ ఉంది. ఆగలేకుండా ఉన్నాడు. ఆ ప్రశ్నల్ని మింగలేక, కక్కలేక సతమతమవుతూ చూస్తున్నాడు. ఏమిటి అన్నట్లు నరసింహులు చూస్తే ఓబిలేసు అడిగాడు.

'వాల్లు నన్నుయాల కొట్టిండారు?'

'వాల్ల అవుసరం!' ఓబిలేసుకు అర్థం కాలేదు.

'యాల అరెస్టు సేసినారు?

'వాల్ల లాబం వాల్లది!' కొంచెం తెలుస్తున్నట్లుగా ఉంది.

'వాల్లు నిన్ను యాల కొట్టిండల్యా?'

'వాల్ల లాబం వాల్లది!'

'నిన్ను అరెస్టు చేసేకి, నువ్వేం చేసిండావు!'

'అరెస్టుల్యా, ఏమిల్యా, నేనే వచ్చిండా!'

'నువ్వేల యీడుంటివి?'

'పోలీసోల్లకు అల్లున్ని, మనుగుడుపుకు వచ్చిండా!' ఓబిలేసుకు ఏమీ అర్థం కావటంలేదు. కొంతలో కొంత అర్థం అయ్యేటప్పటికి పొద్దు పోతుంది. ఏమో తెలిసినట్లుంటుంది. ఏమీ తెలియదు.

స్వార్థం సన్నిధిలో గింగిరాలు తిరుగుతున్న చీకటినుంచి వెలుతురు జవాబు రాలేదని గుర్తించాడు ఓబిలేసు. నిధి సుఖమా, రాముని సన్నిధి సుఖమా అని కాబోలు పాట దూరం నుంచి వినబడుతూ ఉంది.

మాదిగ్గేరిలో ఎవరికీ అక్కరలేనివాడు, పోలీసులకు ఎందుకు కావలసివచ్చాడో, అందరూ అసహ్యించుకొనే మనిషిని వీళ్ళెందుకు ప్రేమిస్తున్నారో, ఎవరూ చేరదీయని వాణ్ణి వీళ్ళెందుకు రానిచ్చారో? సేవ చేస్తున్నారో తెలుస్తున్నట్లుగానే ఉంది.

'పోలీసోల్లకేంది. నీమింద యింత యిది'!

'బయ్యిం!'

'యేందప్ప నర్సింలు?'

'బయ్యిం!'

'బయిఁవా?'

'ఔమల్ల!'

'యేఁవి?'

'ఔదప్పా బయ్యిం!'

'ప్రేమ కాదేమప్పా?'

'కాదు!'

ఓబిలేసు తల తిరిగిపోతూ ఉంది. భయంతో పోలీసులు సేవ చేస్తారు. తమ లాభం కోసం వాళ్ళు హంతకుణ్ణి గౌరవిస్తారు. సామాన్యుణ్ణి కొట్టి చంపుతారు. హంతకుడంటే జనం భయపడతారు. పోలీసులో ఉన్న మనిషి కూడా హంతకుడంటే భయమే! చావుదెబ్బలు తిన్న నేరగాడు ఛస్తే ఫరవాలేదు కాని బతికితే కష్టం. ఎప్పుడేం చేస్తాడో! ఎందుకొచ్చిన పీడ! ఆ నేరగాడు ధనవంతుడయినా, కాకపోయినా, వాడుగాని, వాడి పక్షంవాళ్ళు గానీ లెక్కిస్తే అన్ని సేవలూ అందుతాయి.దుడ్డుంటే కొండమీది కోతి దిగివస్తుంది. దేవుడు దిగిరావటం పెద్ద సమస్య కాదు. దేవుడే ముడుపుల కోసం ముచ్చట పడుతుంటే, అంతంత మాత్రం జీతాలు వచ్చే పోలీసులు ముచ్చటపడితే తప్పు పట్టగలిగేవాళ్ళే ఉండరు.

'నేనేం జేస్తినప్పా నన్ను కొట్టేకి?'

'బయ్యిం లేక!'

'యామంటివి?'

'బయ్యిం లేక, అంటినప్పా'

ఓబిలేసు దిగాలుగా కూర్చున్నాడు. తల పట్టుకొన్నాడు. బీడా ఇస్తే నమిలాడు.

నరసింహులు అతని వళ్ళు తడిమాడు. తల నిమిరాడు. ఓబిలేసు మూలిగాడు. 'నొవ్వా' అంటే 'వూ' అన్నాడు.

'గట్టి దెబ్బలు తగిలినాయా? పోలీసోని చెయ్యి ఎబుడూ వులవుల లాడతా ఉంటది'

'ఆఁ! కాల్లతో తన్నె, సేతులతో పొడిచె, లాఠీలతో బాదె!

ఓబిలేసు కళ్ళలో మళ్ళీ నీళ్ళు తిరిగాయి. నరసింహులు వీపు సవరించాడు. మూతి తుడిచాడు.

'నన్ను జూత్తావుంటే యీల్లకి బయ్యిం యాల లేదప్పా! నిన్ను జూత్తావుంటే యీల్లకి బయ్యిం యాల వత్తాదప్పా నర్సింలు'

'యాట కొడివిలి!'

'ఏమంటివప్పా?'

'గొడ్డిలి!'

'ఆఁ!'

'బరిసె, ఈటె, గడారు!'

ఓబిలేసుకు భయం పట్టుకొంది. నరసింహులు ఆగలేదు. 'కడప బాంబులు! తుపాకీ!' ఎన్ని కావల్ల కొల్లకుండాయి'.

ఓబిలేసు వణుకుతూ ఉన్నాడు. నరసింహులు బొడ్డులో నుంచి పిస్తోలు బయటికి తీశాడు. 'ఇజ్జూసినావా?'

'చూస్తి!'

'ఎన్నడయినా కాలిసినావా?'

'ల్యా!'

'కాలుత్తావా?'

'బయ్యిం'

'యాం లేదప్పా, దీన్ని నొక్కినావే అంకో, గుండు దూసకపోతాది. యెదుటోడి గుండెలో గుండు దూరుతాది. అంతేమల్ల – సెవం'.

ఓబిలేసు పిస్టల్ని తదేకంగా చూస్తూ ఉన్నాడు.

'కొండబో' అన్నాడు నరసింహులు. పిస్టలు ఇచ్చాడు. ఓబిలేసు తీసుకోలేదు. బలవంతంగా చేతిలో పెట్టాడు. ఓబిలేసు వణకసాగాడు.

'వాణికి పోతా ఉండావేమప్పు? యిది నొక్కేదాంకా గుండురాదు. వచ్చినాదా, ఆగదు. బయ్యింల్యా! ఉణ్ణీ'.

'నీకుండాదేమప్పా?'

'ల్యాక?'

ఓబిలేసు వణుకుతూనే ఉన్నాడు. 'నీ తాన పిస్తోలుండాదని వాల్లకు దడ ఉండాదంటే బాగుండాది నర్సింలా, సేవ సేయబట్రే అదెట్లా జరిగిండాది'.

'లెక్క!' లెక్క దేవుడూ! లెక్కుంటే ఎవుడేగాని సెప్పేది సేసేదే. తిరుక్కోడు'.

'యాణ్యుంచి దెచ్చినావు లెక్క?'

'ఇంటే, ఇని తట్టుకుంటే, మారాజు! పూరాగా సదూతా రోత పనుల సిట్టా!'

టేబిల్ శుభ్రం చేసి, కానిస్టేబుళ్ళు, తమ బిరియాని పాకెట్లు విప్పుకొని తినసాగారు. వెనుక వరండాలో కుర్చీలు వేసుకొని ఇద్దరూ కూర్చున్నారు. నిజానికి వాళ్ళు లాకప్పులో, పోలీసు కస్టడిలో ఉన్నట్లు లెక్క. కానీ పోలీసుల బంధువుల్లాగా, అల్లుళ్ళులాగా విందారగించి విశ్రాంతిగా కూర్చున్నారు.

'మేకపోతుల్ది పైన పటారం, లోన లొటారం.మేకలే రవ్వంత మేలు.పొట్లి 'ఢీ' అంటూ కుమ్ముతాది. గొర్రెలు అన్నేయం. గొర్రెదాటే! సంపితే పులుల్ని సంపల్ల. కాలిత్తే సిమ్మాల్ని కాలసల్ల. పోలీసోల్ల దేందుంది పతాపం? పొట్లి మాదిరి పొడిసినా, గొర్రెలే! గొర్రెల్ని గాలిత్తే పిస్తోలు గుండు దండగ. పంజా ఇసిరే సిమ్మం తలబద్దలు గొట్టల్ల! అబుదు గందా పిస్తోలు కుశాలగా పొగలు గక్కేది!

'ఔదప్పా! సిమ్మమెవురు?'

'నాకేమెరిక?'

'నాకెరికే!'

'మడిగనేం?'

ఓబిలేసు పిస్తోలు బొడ్లో దోపుకున్నాడు. ఇద్దరూ లోకాభిరామాయణం మాట్లాడుకొన్నారు. అతన్ని పోలీసులు ఎందుకరెస్టు చేశారో, ఎంత అన్యాయమో చెబుతుంటే యధాలాపంగా వింటూ ఉన్న నరసింహులు నారాయుడి పేరు వినబడగానే ఉలిక్కిపడ్డాడు. ఏమిటేమిటీ అని గుచ్చిగుచ్చి అడిగాడు. మొదటినుంచి అంతా సవివరంగా తెలుపుతూ ఉంటే శ్రద్ధగా ఆలకించాడు. అసలే ఎర్రగుడ్ల నరసింహులు కళ్ళు పీర్ల గుండం నిప్పు కణికలకు మాదిరిగా మండిపోసాగాయి. తన శత్రువును, అతని మిత్రుడైనా, అప్పుడే చంపేంత కోపం నరసింహులుకు వచ్చింది. ఓబులేసు గుర్తించాడు. ఉడికిపోతున్నట్లు కనిపించాడు. కూర్చోలేక, నిలబడలేక, తామసంతో ఉగ్రూతలూగిపోసాగాడు.

'పిస్తోలు పిరికోని బయిుంగురుతే కదేమప్పా నర్సింలు?'

నరసింహులు మాట్లాడలేదు.

'కత్తికి కత్తి బలయినట్లు పిస్తోలు గూడక పిస్తోలుకే పేలిపోతాది కదే మప్పా?'

'ఔ, ఔదప్పా' నరసింహులు ముఖం పులిని చూచినవాడి ముఖంలా ఉంది.

'పిస్తోలిచ్చినావు సరేనప్ప. దాన్ని గురి సూసి కాల్చే దయిర్నెం యెవురిత్తారు?'

'నువ్వు మొగోనివేనా? మొగతనం యెవురిచ్చినారు? అగ్గో ఆయప్పే ఇత్తాదు సుడీ!'

ఇద్దరూ నిశ్శబ్దంగా ఉన్నారు. ఇద్దరి ఆలోచనల కేంద్రం ఒకటే అయినా ఇద్దరూ రెండు పక్కలా నిలబడ్డారు.

'సంపేవోన్ని సంపుతారు కదా!'

'సంపకపోయినా సంపుతారు!'

'తుపాకీ, పిస్తోలు పేల్చటం దయిర్యంవా? పిరికితనమా?'

'యాపొద్దు? యవరి మింద? యే అవుసరం? దాని కత తెలవల్ల! అప్పుడు తెలుస్తాది దయిర్యంవా పిరికి తన!వా'

'పిస్తోలు పట్టినోనికి పిరికితనముంటే ఆత్మహత్య. బయిం లేకుండాంటే హత్య! ఓబిలేసు గొణిగాడు. నరసింహులు ఏమీ మాట్లాడలేదు.

'బలం లేనోని సిట్టసివరి పని పిస్తోలు కాల్చటం!'

'పగోని పేనం తీసేకి బలమైన పనిముట్టు పిస్తోలు!' ఇంకా చెప్పాడు 'బలం దయిర్యం లేనోనికి శక్తీ యుక్తీ పిస్తోలు!' నరసింహులు తీవ్రంగా కనిపించసాగాడు.

'కఱ్ఱలతో, కత్తులతో, పిస్తోల్లతో ఏరులై పారిన నెత్తురు ఏమి తెచ్చినాది? ఏమి యిచ్చినాది? ఏడుపు, పెడబొబ్బలు, పగ, కుళ్ళు, కుట్ర! రాళ్ళతో కొట్టుకొన్న అనాగరికుల కాన్నుంచి, రాకెట్లతో కొట్టుకొనే ఇబుదుండే మొనగాళ్ళ దాంకా ఏం తెచ్చినారు? గరిటెడు గంజి, జానెడు గుడ్డ, తలదాచుకొనే గూడు, ఆరదుగుల నేల, గుప్పెట్లోకి సరిపొయ్యే బూడిద.'

నరసింహులు ఎగాదిగా చూశాడు. ఏమీ మాట్లాడ లేదు.

'పిరికోని పిస్తోలుది పిట్టసావు, బలమైనోని చేతి దెబ్బకే పది ఆంవల్లు పరారవ్వల్ల!'

'నువ్వు పిరికోనివి కావు, బలమైనోనివి'.

'ఉండేలును సూసి కాకి ఉరుకుతాది. యెప్పుదు? గురి సూసి కొట్టే పురసత్తుంటే!

'పిస్తోలుంటే పగోదు పరారుమల్ల!'

'యెంతకాలం పిస్తోలు నీడలో బతకల్ల!'

'సచ్చేదాంకా!'

'పిస్తోలు పారేసి బతికేకి కుదరదా?'

'దెబ్బలు తింటా బతకొచ్చు. అగుమానంగా బతకొచ్చు. ఏడుత్తా బతకొచ్చు'

'వాన్ని సంపేది, వీన్ని సంపేది, అట్లాగే యానాడో సచ్చేది ఏం బతుకప్పా అది'.

'నీకాడ పిస్తోలుందా, నీతో ఎవుడూ పెట్టుకోడు. నీ తాన రాయి లేదా, కుక్క గూడక యెంటబడతాది!'

'పిస్తోలు ఒగటే సాలా, లెక్క ఉండల్ల! బలగం ఉండల్ల! దొమ్మ పొగురుండల్ల!'

ఓబిలేసు ఏమీ మాట్లాడలేదు.

'అడువుల్లో తుపాకులు ఉండిసందుకే పట్టణాలు ఇంతింతమాత్తరం మరేదగా ఉంటన్నాయి. లేకుంటే పేదోల్ల పచ్చి నెత్తురు పాయసమూకట్ల జుర్రుకొనిండరా?'

ఓబిలేసు గుడ్లు మిటకరించి చూశాడు.

'పిస్తోలు నీ తాన ఉణ్ణీ! నీకు బయ్యిం లేదు. నిన్ను తిట్టలేరు. కొట్టలేరు. నీ పంటలు కోయరు. నీ చేను లాక్కోరు. నిన్ను బికారిని సేయరు. పేదోనివని, లేనోనివని, యెవుడన్నా ఆగడం సేత్తే, అలుసుగా సూత్తే పిస్తోలు పైకితియ్. వాల్లు ఆదుంటే ఒట్టు. పారిపోయేదే! నిన్ను సంపుతున్నారా! సావకు. పిస్తోలు తియ్, సంపు. సావు. ఇబుదు జత్తే రేబుడికిరొండు! నూకలుంటే వాల్లను సంపి నువ్వే బతుకు. పిస్తోలున్నోనికి ఎదురు సాక్షకం ఉండదు. పానాలున్నోల్లు కాల్ల బేరానికొత్తారు'.

'సంపేదేల సచ్చేదేల నర్సంలన్నా?'

'సంపొద్దు, సాయొద్దు! ఓబిలేసు తనను అన్నా అన్నందుకు నర్సింలు పొంగిపోయాడు. బతుకు! బతకనిత్తే మారాజకట్ల బతుకు. నిన్ను బతకనీయకపోతే సంపు. సావు. సింతలేదు.

సింత నిప్పులు కక్కుతున్న కళ్ళతో ఓబిలేసు కళ్ళలోకి చూస్తే నరసింహులు బెదిరిపోయాడు.

ఉన్నట్టుండి పిస్తోలు సరుదుకొని, లేచి నిలబడి, 'నీకిది తెలుసునేమప్ప! నీ బసేలిని లొంగదీసుకొని కడుపుచేసి, చెరిపినోనికత నీకెరికేనా?'

'ఎరికే!'

'నా చేనూ, ఆపున్నేతుమురాలూ - వాని ఆగడానికి బలేకదేమప్పా!'

'బలే!'

'మడి వాన్ని బలిసెయ్యాల్లా? వొద్దా!'

'సెయ్యల్ల!'

'సెయ్!

'పిస్తోలు నీ తాన కదా ఉండాది?'

'ఉండాది!'

'మల్ల?'

ఇద్దరూ మాట్లాడలేదు.

పోలీసులు ఓబిలేసును లాకప్పు నుంచి వెలుపలికి తీసుకొనిరావటం, కుర్చీలో కూర్చోనివ్వం, బిరియాని తినబెట్టటం, నరసింహులు ఓబిలేసు అన్నదమ్ములులాగా ప్రేమతో మసలటం చెట్లు కింద, టీ బంకు పక్క, రోడ్డువార నిలబడ్డ గడేహోతూరు మాదిగలకు ఆశ్చర్యంగానూ ఆనందంగానూ ఉంది.

పోలీసులు జేబులు కొట్టినవాళ్ళను పట్టుకొని వచ్చారు. వడ్డించారు. లాక్కున్నారు. వదిలేశారు. బ్రోతల్‌కేసుల్లో పట్టుబడ్డవాళ్ళ వస్తువులు, వాళ్ళ వాళ్ళు వచ్చి తీసుకుపోయారు. ఫైన్ కట్టి కోర్టులో వాళ్ళను వదిలించుకొన్నట్లు, బ్రోతల్ కేసుల్లో ఆడవాళ్ళే వేశ్యలనబడుతూ దొరుకుతారు. మగవాళ్ళు దొరకరు. శిక్షలుండవు.

పోలీసులు కానీ, నరసింహులుకానీ, ఓబిలేసును లాకప్పులోనే కూర్చోమని చెప్పలేదు. రాత్రి తగిలిన దెబ్బలు ఇప్పుడు నొప్పి పుడుతున్నాయి. నడవటం, కూర్చోవటం కూడా కొంచెం కష్టంగానే ఉంది.

మసక చీకటి పడుతూ ఉండగా పోలీసు స్టేషన్ ముందు కలకలం బయలుదేరింది. కారు దుమ్మురేపుకొంటూ వస్తూ ఉంది. జనానికి ఆ కారు గుర్తే! రెడ్డి కారు!

రెడ్డి కారు దిగాడు. ఒంటరిగా ఉన్నాడు. డ్రైవరు దిగి డోరు తీయగా దిగి పోలీసు స్టేషన్‌లోకి నడిచి వచ్చాడు. కానిస్టేబుళ్ళు టోపి సర్దుకొని ఎదురు వెళ్ళారు. వాళ్ళను పక్కకు నెడుతూ నరసింహులున్న టేబుల్ దగ్గరకు వచ్చాడు.

రెడ్డి గుర్తించాడు. వాళ్ళిద్దరూ లేచి నిలబడి చేతులు కట్టుకోవాలి. లేవలేదు. నిలబడలేదు. పరిస్థితి చిత్రంగా ఉంది. వాళ్ళూ తనను చూశారు. భయపడలేదు. భక్తి లేదు. ఒక గౌరవం లేదు. ఒక మర్యాద లేదు. రెడ్డి ఆలోచించసాగాడు.

నరసింహులు తాగి ఉంటే, తాగుతూ ఉంటే తనను గౌరవించడు. ఇప్పుడు తాగినట్లున్నాడు. ఓబిలేసుగాడు తాగడు. వాడు లేచి నిలబడలేదంటే ఏదో తిరకాసుంది.

రెడ్డి నరసింహులు దగ్గరగా పోగానే, కానిస్టేబుల్ కుర్చీ తెచ్చి వేశాడు. వాళ్ళతోపాటు తానూ కూర్చున్నాడు. నరసింహులు నోరు వాసన తెలుస్తూ ఉంది. తాగినట్లు లేదు. అయినా మాట్లాడించాడు. వాసన లేదు. తాగలేదు. తాగనివాడు లేవలేదు. వ్యవహారం తారుమారయిందా? చాలా దూరం పోయిందా? రెడ్డి ఆలోచనలో పడ్డాడు.

అప్పుడు నరసింహులు కలగచేసుకున్నాడు. 'ఓబులూ లెయ్! లేసి, అట్టబొయ్యి ఆడ కూచో!' లేచి, పక్కకు పోయి, కుర్చీలో కూర్చున్నాడు. ఒకళ్ళకొకళ్ళు కనబడుతున్నారు. వాళ్ళిద్దరూ మాట్లాడుకొనేది వినబడదు.

ఓబిలేసు లేవలేదని నరసింహులు లేవలేదో, నరసింహులు లేవలేదని ఓబిలేసు లేవలేదో పోలీసులు తేల్చుకోలేకపోయారు.

కుర్చీలోంచి లేవకుండా కూర్చుని ఓబిలేసు గర్వపడ్డాడు. రెడ్డి అహంకారం బద్దలు కొట్టినట్లు అనుకొన్నాడు. అతను కుళ్ళి చచ్చేటట్లు చేశానని ఆనందించాడు. మాదిగలంతా గర్వపడే పని చేశాననుకొన్నాడు. సైనికుల వంశ ప్రతిష్ఠ నిలబెట్టానని భావించాడు. అంత వొళ్ళు నొప్పుల్లోనూ అతను ఆనందించాడంటే ఎంత అక్కసు కరిగి నీరై జారిపోయి మనిషి తేలికపడ్డాడో చెప్పటం కష్టం.

చేసిన ఏర్పాట్లు అన్నీ వివరించి, నరసింహుల్ని తీసుకుపోవటానికి వచ్చానని చెప్పాడు. అతను సంతోషపడి 'పోదాం' అన్నాడు.

రెడ్డి పోలీసుల్ని చేరబిలిచి, చేతిలో నోట్లుంచి 'యఫయ్యారు రాసి పెట్టిండారేమప్పా' అని అడిగాడు. వ్రాయలేదని చెప్పారు. 'మడి, మా నరసింలుని కొండబోదు నేమప్పా నా యెనకాతల?' పోలీసులు తలలూపారు.

హెడ్డు కూల్‌డ్రింకులు తెప్పించాడు. ఇద్దరికీ ఇప్పించాడు. రెడ్డి తాగుతున్నాడు. నరసింహులు తాగలేదు. ఆగాడు. 'వానికి లేదా?' ఓబిలేసుని చూపించాడు. 'రెండే తెచ్చినారేమప్పా ఎద్దూ' అన్నాడు. అప్పటికే పరుగు పరుగున మరొకటి తెప్పించాడు హెడ్డు. ముగ్గురూ తాగుతూ ఉన్నారు. వెనక తాగటం మొదలు పెట్టిన ఇద్దరూ తాగటమయిపోయింది. ముందుగా తాగటం ప్రారంభించిన రెడ్డి కూల్‌డ్రింకు ఇంగా సగం పైనే ఉంది సీసాలో. రెడ్డి ఆలోచనలో ఉన్నాడు. వాళ్ళ మైత్రి అర్థం కాసాగింది. అదెప్పటినుంచో అర్థం కాలేదు. వీళ్ళిద్దరికి స్నేహం ఉంటే దాని పర్యవసానం ఏమిటో, ఎలా ఉంటుందో ఊహించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ పనిలో పడి డ్రింకు తాగటంలో వెనకబడ్డాడు రెడ్డి.

యస్సై ఇంకా స్టేషన్‌కు రాలేదు. 'యస్సయ్య ఇంకా రాలేదేమప్పా టేసన్‌కి? రారా? ఊరిలోలేరా'.

హెడ్డు యస్‌ఐ వస్తాడని, బయలుదేరి ఉంటారని అంటే రెడ్డి తల ఆడించాడు. వస్తే చెప్పాల్సింది చెప్పి, ఇవ్వాల్సింది ఇచ్చి వెళ్ళిపోవాలని రెడ్డి ఆలోచన.

'కేసు లేదప్పా నర్సింలూ!'

నరసింహులు నవ్వితే పొట్టి ఫీ కొనబోయినట్లుంది. పులి చూస్తూ ఉండిపోయింది.

'వాల్లు – వాల్లే. ఇద్దరిని లేపినారు మనోల్లు. మనోల్లు శానా మొనగాల్లేనప్పా యాఁవో అనుకొంటా ఉండినాముగానీ'

నరసింహులు తలూపాడు.

'కిరాయి ముఠా అంతా గల్లంతు. వొక్కరూ అజా పజా లేరు. యామట్టిలో కలిసిపోయినారో, యామయినారో!'

'అట్లే అనుకొన్నారొడ్డి!'

ఓబిలేసును తీక్షణంగా చూస్తున్న రెడ్డినీ, మిరిమిర్రి వెర్రివాడులాగా చూస్తున్నవాడిని చూచి, 'రొడ్డి! ఆయప్ప ఇగమనోడే! పగోడు గాదు!' అన్నాడు.

'యెట్లా?' రెడ్డి నోరు తెరిచి, మూయటం మరిచిపోయాడు.

'ఔరొడ్డి. నేన్నీబంటు ఇగ ఆయప్ప నా బంటు. మేం నీ బంట్లు. మడిగ నువ్వెంత చెబుతే అంత!'

రెడ్డి సంతోషపడ్డాడు. అయినా సందేహం పూర్తిగా తొలగిపోలేదు. ఓబిలేసును చూశాడు. అతనేదో ఆలోచనలో ఉన్నాడు. రెడ్డిని గమనించలేదు.

'ఆ సేద్దెగాల్లు – వాల్లు బొయ్యి – వాని సేని పంట, సన్ ఫ్లవరు కోసేసినారంట రొడ్డి!'

'అట్లనా?'

'ఔరొడ్డి! పుండ్లు మింద కారం సల్లినట్లు వాల్లు కేసు గూడా పెట్టినారు రొడ్డి!'

'ఔనారా!' రెడ్డి ఓబిలేసును అడిగాడు. ఓబిలేసుకు ఏం చెప్పాలో తోచలేదు.

'వాని తలకాయ! వానికేం తెలపదు రొడ్డి – వాని సేను వానికి ఇడిపీ రొడ్డి!

'అట్లే కానీయప్పా! నువ్ జెబితే వొగటి నేను జెబితే వొగటా? నువ్వెట్లంటే గదేమప్పా నరిసింలు!'

నరసింహులు తన మాట వింటాడు. చెప్పినట్లు చేస్తాడు. ఎదురు చెప్పడు. అసలు ఆలోచించడు. పని చేయటమే తెలుసు. అట్లాంటివాడు తన ఎదుట మాట్లాడుతున్నాడు. మాట్లాడటమే కాదు సలహాలు యిస్తున్నాడు. సలహా పాటించమంటున్నాడు. తన పరోక్షంలో వాడు తనంతటివాడే, కాని ఎదుటే తనంతటివాడుగా మాట్లాడుతున్నాడు. ఆశ్చర్యం!

'వానికీ మేలు నువ్ జేసినట్లయితే రొడ్డి, వోడు నీకు బానిస! నీ కూలోడు! నీ సేద్దగాడు'

'నీమాటే నామాట నర్సింలు. నీ సలహా నాకు పూరాగా నచ్చినాది.'

నరిసింహులు సూచన చేసే మొనగాడు అయ్యాడు. తాను వాడి సూచన అంగీకరించాలి. అనుకూలంగా ప్రవర్తించాలి. అడిగింది చేయాలి. వాణ్ణి పెరగనివ్వవచ్చునా? పెరగనివ్వరాదా? ఆదిలోనే తుంచాలి. ఆపైన కష్టం. మొక్కనే తుంచాలి. మానుని ఏమీ చేయటం కుదరదు. గోటితో పోతుంది, ఇప్పుడైతే. గొడ్డలి కావాలి మునుముందు. మొక్కను గిల్లి అవతల పారేసినట్లే! కాదంటే ఏమవుతుంది? ఎప్పుడూ సలహాలు, సూచనలు ఇవ్వనివాడు, ఇచ్చే ధైర్యం లేనివాడు, సాహసం చేయలేనివాడు ఏమనుకొంటాడు? ఏం చేస్తాడు?

వాళ్ళిద్దరూ ఒక కులం వాళ్ళు. పైగా కొంతలో కొంత బంధువులు. రక్తసంబంధం. నెత్తురు చిక్కన! స్నేహం సారాయి. మత్తు! బ్రాందీ విస్కీ మత్తు వదిలితే రక్తం గట్టిగా గట్టి

పడుతుంది. ఒకటవుతారు వాళ్ళు. ఇప్పటికే ఒకటయ్యారు. ఆ యిద్దరూ తన మీద వైరం పెంచుకోవచ్చు. వాళ్ళను వశం చేసుకోవాలంటే, చెప్పు చేతల్లో ఉంచుకోవాలంటే, నరసింహులు సలహా పాటించటం మంచిది!

రెడ్డి తేరిపార చూశాడు ఓబిలేసును. అతను ఎటో చూస్తూ ఏదో ఆలోచనలో ఉన్నాడు.

రెడ్డి మళ్ళీ యోచించాడు. నరసింహులు సూచన పాటించకపోతే ఏమవుతుంది? ఇద్దరు శత్రువులు కావచ్చు. అయితే ఏం చేస్తారు? ఏమీ చేయలేరు? ఏమన్నా చేయటానికి సిద్ధమయితే? చేయి చేసుకోవచ్చు! ఇద్దరికీ భూమి మీద నూకలు చెల్లిపోవచ్చు!

తన గుట్టుమట్టులన్నీ సుస్తాగా నరసింహులుకి తెలుసు. వాడితో పగ ప్రమాదమే! వాణ్ణి చంపితే తన చేయి తానే నరుక్కొన్నట్లు! వాణ్ణి ఏమీ చేయరాదు. ఇద్దరినీ లొంగ దీసుకోవాలి! అందుకు ఒక్కటే మార్గం! వాడి సలహా మన్నించటం!

నరసింహులు సలహా మన్నిస్తే తాను కష్టపడి కట్టుకొన్న ప్రజల భయభక్తులనే కోట పునాదుల్లో బీటలు పడతాయి. పగుళ్ళు వస్తాయి. నెర్రెలు పడతాయి. కూలిపోతుంది కోట. చచ్చుదద్దమ్మ పిరికి సన్నాసి. వెర్రి ఎదవ అని చాటుమాటుగా జనం అనుకోవటం వినవలసి రావచ్చు.

కానీ మంచివాడని, మంచి బుద్ధి వచ్చిందని, వృద్ధాప్యంలో దైవభక్తి పెరిగి, ధర్మకార్యాలు చేస్తున్నాడనీ అనుకోవచ్చు జనం. బీటలు వారిన కోటకు వాటంతట అవే మరామత్తులుజరిగిపోతాయి. తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లదు. తన మాటకు తిరుగుండదు. మంచివాడనిపించుకోవటం కూడా అవసరమే!

ఓబిలేసు చేని విషయంలో చేసిన మంచిపనే అందరికీ చేయమని అందరూ అడిగినా వాళ్ళ పక్షాన వీళ్ళు అడిగినా, సమస్యలు పుడతాయి. పెరుగుతాయి. జటిలమవుతాయి.

నరసింహులు సూచన మన్నించకపోతే, ఇంటా బయట, ఉన్నూరులో పొరుగూర్లలో పెరుగుతున్న తలనొప్పులు మరింతగా విచ్చలవిడిగా పెచ్చరిల్లుతాయి. అట్లయితే, వాటిని అదుపు చేసుకోవటానికీ సమయమంతా, శక్తియుక్తులన్నీ, ఆర్థిక వనరులన్నీ ఖర్చు అయిపోతాయి. ఆ ఖర్చు రానీరాదు.

ఇప్పటికే మాదిగ్గేరి జనం బాగా వ్యతిరేకంగా ఉన్నారు. వాళ్ళకు వీళ్లిద్దరూ తనవాళ్ళుగా నాయకులైతే, వాళ్ళను అణచి వుంచవచ్చు. లేదంటే ప్రమాదకరమైన గుంపుగా వాళ్ళు మారే పరిస్థితి ఉంది. అది జరగరాదు. పక్కలో బల్లేలు అవుతారు. నిన్నటి నుంచి, రాత్రి కూడా వాళ్ళు అక్కడే ఉన్నారంటే ఓబులుగాడి మీద వాళ్ళ అభిమానం అర్థమవుతుంది. ఓబులుగాడు వెర్రివాడు. వీణ్ణి చూసుకొని వాడు నీలుగుతున్నాడు. వీడు లేకపోతే వాడు గుండుసున్న.

వీడుంటే వాడొక బండరాయి. వాణ్ణి అదుపాజ్ఞలో ఉంచటం తేలిక. వాడెంత ఎగిరిపడ్డా, రెండు పోలీసుల ఏటులకే బిక్కచచ్చిపోతాడు. తాను అసలు పూనుకుంటే వాడు నిలబడగలడా? నిలబడలేడు!

నరసింహులు వాడితో కలవటమే విచిత్రం! వాడికి లేని పొగరు తేవటం మరీ వింత. వాడితోపాటు వీడు పొగరుగా కూర్చోవటం ఇప్పటికీ తాను గమనించకపోలేదు. సామదానభేద దండోపాయాలలో సామం పనికిరాదు. దండనకు పరిస్థితి పరిపక్వం కాలేదు. దాన కార్యం ప్రస్తుతానికి మంచిదే! దానం అంటే చేనే! తన చేను తాను సాగుచేసుకొనేట్టు చూడటమే. అంతకుముందు భేదోపాయం ప్రయత్నించాలి! అది ఫలించకపోతే దానోపాయం ఉండనే ఉంది.

తన నింత చింతనకు బలిచేసిన నరసింహుల్ని చంపేస్తే! అవసరమయితే అదే ఆఖరి చర్య. ఈలోగా తన మేక వన్నె జనం చూడటం అవసరమే. వీళ్ళను సంతోషపెట్టటం మంచిది. ఈలోపల వీడేమయినా దుశ్చర్యకు పాల్పడే ప్రమాదం ఉంది. కనిపెట్టి ఉండాలి. రెడ్డి ఒక నిర్ణయానికి వచ్చాడు.

'నర్సింలూ!' అంటూ రెడ్డి తన నిర్ణయం చెప్పటానికి సిద్ధమయ్యాడు.

'ఓబులేసు' అని నరసింహులు పిలిచాడు. అతను వచ్చి ఎదుట నిలబడ్డాడు. చేతులు కట్టుకొన్నాడు.

ఆ స్థితి చూచి రెడ్డి పొంగిపోయాడు. తన నరసింహులు ఓబిలేసును తన ఎదుట చేతులు కట్టుకొని నిలబడేటట్లు చేసి తన మర్యాద కాపాడాడు. మునుముందు మరింతగా కాపాడగలడు. అయినా తన భేదోపాయం వదలకూడదు.

'నర్సింలూ, నువ్వు జైలులో ఉండినబుడు నీ బసేలిని చెరిసినోడు నీకు గొత్తేనా?'

'ఔదప్పా', గొత్తే'

'మడి నేస్తుడు ఓబిలేసు యెంత పనిచేసినాడో సూసినావా? గఁవనవేనా?'

'ఔదప్పా!'

ఓబిలేసు తనకేం తెలియదని చెప్పబోయినట్లు చూచిన చూపు పట్టుకొన్న నరసింహులు' 'అదంతా నాకు తెలుసుగదేమప్పా' అన్నాడు.

రెడ్డి నోట మాట లేదు. తను ఊహించిన పరిణామం జరగలేదు. తను సందేహించిందే నిజమయింది. భేదోపాయం పని చేయలేదు. దాన కార్యం అనివార్యం.

రెడ్డి పై చేయిగా 'ఓబులేసూ!' అని పిలిచాడు.

ఓబిలేసు అంతే స్థాయిలో 'యేం నారాయుడూ!' అన్నాడు. ఒక గౌరవం లేదు. ఒక మర్యాద లేదు

'యాఁవంటివిరా?' అని రెడ్డి గద్దించాడు.

'యేం నారాయుడూ అంటినిరా' అన్నాడు.

'నన్ను రా అంటివేంలే!'

'పోలే! అంటిని యేంమల్ల? యేం నీకత?'

నరసింహులు 'ధూ నీయమ్మ! నీయక్క' అని ఓబిలేసును తిట్టి 'తిక్కోని మాటలకేం రొడ్డి. వాని పొగురు నేనణసనా? ఉణ్ణీ! నువ్వు మంచోనివి రొడ్డి! మంచి పనులే చెయ్యాల్ల ఇడీ'

ఉడికిన రక్తం చల్లబడుతున్నప్పుడు వీడికింత ధైర్యం, మాట అనే బలం ఎక్కణ్ణుంచి వచ్చాయో గుర్తించటానికి రెడ్డి గిలగిలలాడి పోయాడు. ఓబిలేసు మాట్లాడలేదని అతని బొడ్లోని పిస్తోలు మాట్లాడిందని రెడ్డికి తెలియదు.

తననట్లా మాట్లాడి బతికిన వాడులేడని రెడ్డికి తెలుసు. ఓబిలేసు బతికి ఉండటం తన భంగపాటుగా అనిపించింది. ఎవరూ వినకపోవటం, తనను పోలీసులు కూడా గమనించకపోవటం తన అదృష్టంగా భావించాడు రెడ్డి. కానీ రక్తం చల్లారినా గుండెలో శూలం గుచ్చినట్లే ఉంది. దాన్నిప్పుడు బయటికి పీకలేడు. బైటపడడు.

'నామాటిను రొడ్డి. నీ పున్నెం నువ్చెయ్. నీ దానం నువ్వీ!' అన్నాడు నరసింహులు.

'అట్నేలేప్పా! ఎబుడేనా నువ్వా అంటే నేనా అంటినా? నువ్ మాటిత్తే నే దప్పుతానా?' అన్నాడు రెడ్డి.

అంతలో యస్.ఐ. మోటర్ సైకిల్ వచ్చి పోలీసు స్టేషన్ ముందాగింది. సెంట్రీకి బండి అప్పగించి, లోపలికి వచ్చి, సేల్యూట్ రీవిగా అందుకొని, రెడ్డిని చూచి 'ఏం సెలవు?' అన్నట్లుగా చేతులు కట్టుకొన్నాడు యస్.ఐ.

'యస్సయ్యా! వానిమింద యఫ్ఫయారు రాయించినావేమప్పా?'

'లేద్దేవరా!'

'వాన్నిడీ!'

'సరే దేవరా!'

'ఓరే ఓబులూ!' రెడ్డి పిలిచాడు. యస్.ఐ. ముందు, పోలీసు [illegible] గుర్తుకు వచ్చి ఓబిలేసు మిడిగుడ్లుబడి వెర్రిచూపులు చూశాడు.

రెడ్డి చెప్పాడు. 'నీ సన్నుష్లవురు పంట నువ్వేకొండబో! ఇగ నీసేను నువ్వే సేసుకో మారాజులెక్క'

'వాన్నిడీ' అని యస్.ఐ.తో చెప్పాడు. అతను తలూపాడు. నరసింహులు నవ్వుకొన్నాడు. ఓబిలేసు ఆశ్చర్యంగా చూస్తున్నాడు, స్వేచ్ఛాజీవిగా.

తన బంటు, నమ్మిన బంటు నరసింహుల్ని వెంటబెట్టుకుపోయి, కారెక్కాడు, గడేహోతూరు గ్రామాధికారి - రెడ్డి - ఉద్యోగం పేరుతో రెడ్డిగా పిలవబడే నారాయుడు.